
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

I

సోమవారం। 15। జనవరి। 2024



సోమశిలలో 30.466 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 30.466 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 6 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,610
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,802
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,976
నవర (8 గ్రాములు)	రూ.47,808

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /23.7

ఆదివారం గాలిలో తేమ 55 శాతం ఉంది.

ఊరూ వాడా.. సంక్రాంతులు

కళకళలాడుతున్న పల్లెలు

- ఉత్సాహంగా భోగి మంటలు
- నేడు సంప్రదాయబద్ధంగా పెద్ద పండగ జరుపుకోనున్న ప్రజలు
- రేపు పశువుల పండగ కనుమ
- 17న నెల్లూరులోని పెన్నానదిలో ఏటి పండగ నిర్వహణకు ఏర్పాట్లు



నెల్లూరులోని మైపాడు గేట్ సెంటర్ వద్ద భోగి మంట వేస్తున్న నగరవాసులు



కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో ఉరకలెత్తుతున్న ఎద్దు

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఊరూ వాడా.. సంబరాల్లో మునిగిపోయాయి. గొబ్బెమ్మలు కొలువుదీరిన ముంగిళ్లు.. పిండి వంటల ఘుమఘుమలు.. ఆత్మీయ పలకరింపులు.. అత్తగారిళ్లకు విచ్చేసిన అల్లుళ్లు.. చిన్నారుల ఆటపాటలు.. ఇలా పల్లెల్లో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా జిల్లాలో ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రజలు తమ ఇంటి ముంగిళ్లలో భోగి మంటలు వేసి భోగభాగ్యాలనిచ్చే భోగి పండగను వేడుకగా జరుపుకున్నారు. సంక్రాంతి సంబరాలకు స్వాగతం పలికారు. సోమ, మంగళ వారాల్లో సంక్రాంతి, కనుమ పండగలను కూడా సంప్రదాయబద్ధంగా జరుపుకోనున్నారు. – నెల్లూరు(సెంట్రల్)

క్లుప్తంగా

భోగి సంబరాల్లో వీపీఆర్ దంపతులు


భోగి మంట వేస్తున్న వీపీఆర్ దంపతులు

నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు భోగి సంబరాల్లో పాల్గొన్నారు. నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న తమ నివాసంలో ఆదివారం సిబ్బందితో కలిసి భోగి మంటలు వేశారు.

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలి


ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: జిల్లా ప్రజలు సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో రూరల్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు.

మస్తాన్‌రావును కలిసిన ఎన్టీఎఫ్ నాయకులు


బీదను సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావును ఆదివారం అల్లూరులోని ఆయన స్వగృహంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎన్టీఎఫ్ జిల్లా చైర్మన్ దాసరి పోలయ్య, నాయకులు దయాకర్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న నిమ్మ ధరలు



పొదలకూరు: రెండురోజులుగా నిమ్మ ధరలు పెరిగాయి. నిన్నటి వరకు అధిక ధర రూ.800 కూడా లేదు. అయితే ప్రస్తుతం ధరలు మోస్తరుగా పెరిగినట్లు వ్యాపారులు వెల్లడించారు. స్థానిక మార్కెట్ యార్డులో లూజు (బస్తా) రూ.2 వేల నుంచి రూ.2,700 వరకు ఉంది. అయితే నాణ్యత కలిగిన కాయలకే ఈ ధరలు వర్తిస్తాయని వ్యాపారులు వెల్లడించారు. గతేడాది వేసవి కాలంలో బస్తాకాయలు రూ.10 వేలు, కిలో నిమ్మకాయలు రూ.125 అమ్మారు. ఈ ఏడాది ధరలు ఆకాశాన్ని అంటుతాయని రైతులు భావిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో రైతుల తోటల్లో కాయలు ఉంటే ధరలు పొంది ఆర్థికంగా బలపడే అవకాశం ఉంది.

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: ఆటో బోల్తాపడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో ఆదివారం జరిగింది. వివరాలు.. వెంకటాచలం నుంచి కసుమూరుకు వెళ్తున్న ఆటో పాలిచెర్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద టిప్పర్ అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పెంచలమ్మ, రమణమూర్తిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భళిరా బసవన్నా..


ప్రజల కోలాహలం నడుమ జరుగుతున్న ఎడ్ల పందేలు

- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు
- విజేతగా నిలిచిన కోవూరు ఎడ్లు
- భారీగా తరలివచ్చిన ప్రజలు

కోవూరు: మండలంలోని కోవూరు కొత్తూరు రోడ్డు ప్రాంతంలో అరవింద రైసుమిల్లు సమీపంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా జరిగాయి. భోగి పండగ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో 36 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వీటిని తిలకించేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. యువత, రైతుల కేరింతల నడుమ జరిగిన ఈ పోటీలు ఆద్యంతం కనువిందు చేశాయి. 3 కి.మీ దూరాన్ని తక్కువ సమయంలో పూర్తి చేసిన ఎడ్లకు ప్రథమ బహుమతి కింద వెండి కప్పు, నగదు అందిస్తామని నిర్వాహకులు చెప్పడంతో అధిక స్పందన వచ్చింది. 35 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సైలు రంగనాథ్ గౌడ్, వీరేంద్రబాబు, నిర్వాహకులు మల్లికార్జునరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

కోవూరు మండలానికి చెందిన చెన్నకేశవుల ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు సోమశేఖరరెడ్డిచే రూ.15,116 నగదు, వెండి కప్పు అందజేశారు. రెండో స్థానంలో చాముండేశ్వరి సీ ఫుడ్స్ గంగపట్నం ఎడ్లు నిలిచాయి. దండి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం వారి సతీమణి సుబ్బమ్మ, కుమారులు రూ.13,116 ఇచ్చారు. తృతీయ స్థానంలో పాటూరు గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయం ఎడ్లు నిలిచాయి. వారికి రూ.10,116 అందజేశారు.


ప్రథమ బహుమతి అందుకుంటూ..


రెండో బహుమతి అందజేస్తున్న దృశ్యం


మూడో బహుమతి స్వీకరిస్తూ..

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


గ్యాస్ స్టౌ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- తోడేరు గ్రామమంటే ప్రాణం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన ప్రకారం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉన్నారు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం మంత్రి తన స్వగ్రామమైన తోడేరుకు విచ్చేశారు. 65 మంది మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్టౌలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామమంటే ప్రాణమన్నారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి కోరిక మేరకు ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా సొంతూరిని మర్చిపోకుండా సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. సొంత మనుషుల మధ్య పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కుటుంబసభ్యులు, బంధువులు ఎవరని అడిగితే సర్వేపల్లి ప్రజలు, తోడేరు గ్రామస్తులని చెబుతానన్నారు. తమ కుటుంబం ఒక స్థాయికి రావడానికి కారణం గ్రామ ప్రజలేనన్నారు. వంట గ్యాస్ కనెక్షన్లు ప్రతి కుటుంబానికి అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. హరిపుష్కర గ్యాస్ ఏజెన్సీ ద్వారా తోడేరు మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఏజెన్సీ నిర్వాహకులు సునీతలక్ష్మి, రాంబాబు చొరవతో సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5 వేల కనెక్షన్లు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో ఇంకా మిగిలిపోయిన వారు ఉంటే ఉచితంగా అందజేస్తామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	118
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	214
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	240
లేయర్ చికెన్ :	145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.34
సన్నవి :	రూ.25
పండ్లు :	రూ.15

కోడిపందేల స్థావరంపై దాడులు

సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం సంగం పోలీసులు దాడులు నిర్వహించారు. 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,880 నగదును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్


మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్, చిత్రంలో దళిత సంఘాల నాయకులు తదితరులు

నెల్లూరు (దర్గామిట్ట): 'రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమానికి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా తరలిరావాలి' అని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత అయిన బాబాసాహెబ్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ.400 కోట్లతో 200 ఎకరాల విస్తీర్ణంలో విజయవాడలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆయన జీవిత చరిత్రను తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, లైబ్రరీ వంటి వాటితో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. విగ్రహం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పండగ వాతావరణంలో పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వాటిలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంబేడ్కర్ భావజాలంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్ బాబు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


సంగం: సాయి మృతదేహం

జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. దుత్తలూరు మండలంలో తండ్రి చనిపోగా కుమారుడు గాయపడ్డాడు. సంగం మండలంలో ఓ యువకుడు, అనంతసాగరం మండలంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి.

పిల్లాపేరు వద్ద..

దుత్తలూరు: మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలో పిల్లాపేరు వాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందగా అతని కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వరికుంటపాడు మండలం దక్కనూరు గ్రామానికి చెందిన ఇ.వెంగయ్య (60), మధు తండ్రీకొడుకులు. పని నిమిత్తం మోటార్‌బైక్‌పై నర్రవాడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పిల్లాపేరు వాగు వద్దకు రాగానే ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారికి తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు తరలిస్తుండగా వెంగయ్య మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాశంకర్ తెలిపారు.

కారును ఢీకొని..

సంగం: మండలంలోని సిద్ధీపురం వద్ద నెల్లూరు – ముంబై జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి సాయి (18) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సిద్ధీపురం గ్రామానికి చెందిన బండి జయలక్ష్మి, వెంకట్రావు దంపతుల ఒకే కుమారుడు సాయి. వెంకట్రావు మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పోషించేందుకు సాయి చేపల వేట చేస్తుండేవాడు. ముత్తుకూరు మండలంలో ఉండేవాడు. ఈ క్రమంలో భోగి పండగ సందర్భంగా సిద్ధీపురంలోని తల్లి వద్దకు వచ్చాడు. సాయి రాత్రి తన బైక్‌పై బుచ్చిరెడ్డిపాళెం వద్దనున్న అమ్మమ్మ వద్దకు బయలుదేరాడు. సిద్ధీపురానికి కూతవేటు దూరంలో ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న కారును మోటార్‌బైక్ ఢీకొంది. దీంతో సాయి రోడ్డుపై పడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ముందు భాగం దెబ్బతింది. సమాచారం అందుకున్న తల్లి, కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కాసేపటి క్రితం వరకు తమను నవ్వించాడని, అమ్మమ్మ వద్దకు వెళ్లొస్తానని పది నిమిషాల ముందే బయలుదేరాడని, అంతలోనే ఇలా జరిగిందంటూ తల్లి రోదించారు. సమాచారం అందుకున్న సంగం ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై వెళ్తూ..

సోమశిల: అనంతసాగరం మండలంలోని గుడిగుంట గ్రామానికి చెందిన బద్దల సాంబయ్య (48) అనే వ్యక్తి శనివారం అర్ధరాత్రి మోటార్‌బైక్‌పై వెళ్తుండగా పాతాలపల్లి వద్ద జాతీయ రహదారిపై మృతిచెందిన గేదెను ఢీకొన్నాడు. దీంతో అతను కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 10 అంబులెన్స్‌కు సమాచారంతో సిబ్బంది వచ్చి ఆస్పత్రికి తరలించేలోపు చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు ఆదివారం తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై
ప్రజలకు అవగాహన


క్యాలెండర్లను ఆవిష్కరించిన అధికారులు

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు అన్నారు. ఆదివారం నగరంలోని 9వ వార్డు పుల్లమ్మ సత్రం, నవాబుపేట, హెచ్‌పీ పెట్రోల్ స్టేషన్ సమీపంలో, స్థానిక 26వ వార్డు వేదాయపాళెం, మోర్ మార్కెట్ వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు వివరించి, అర్హులందరికీ వాటిని వర్తింపజేయాలని అధికారులకు సూచిస్తున్నామన్నారు. అనంతరం కేంద్ర పథకాలను తెలియజేసే నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వాగత, ఉత్సవ, కల్చరల్ కమిటీలకు చెందిన సభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎడ్ల పందేలు రేపు

గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులో రెడ్డి పాలెం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో 16న కనుమ పండుగ రోజు మండల స్థాయిలో ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వహకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే ఎండ్ల పందెంలో మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు సోమవారం లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9100603573 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేదలకు అండ ఎర్ర జెండా



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కందుకూరు: భారత కమ్యూనిస్టు పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఆదివారం సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక ఉద్యమాలను సీపీఐ నిర్వహించిందన్నారు. ఇళ్ల స్థలాలు, సాగు భూముల కోసం పోరుబాట నిర్వహించి వేలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టిన ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో పేదలను మభ్యపెడుతున్నాయని చెప్పారు. సీపీఐ లెనిన్‌నగర్ శాఖ జాయింట్ సెక్రటరీ కోటేశ్వరరావు, నియోజకవర్గ సభ్యులు కె. మురళి, బాలబ్రహ్మాచారి, ఆలూరి చంద్రశేఖర్, ఎల్. రావమ్మ, జయమ్మ, లీలమ్మ, డి. జయమ్మ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

లింగసముద్రం: కోడిపందేల స్థావరంపై దాడి చేసి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను, మూడు కోళ్ళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. అన్నెబోయినపల్లె గ్రామ శివారుల్లో ఆదివారం ఉదయం కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్ళినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

పీసీపల్లి: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంపీపీ అత్యాల జపన్య, ముద్దపాడు సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం ముద్దపాడులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటలను సహజమన్నారు. సచివాలయాల కన్వీనర్ శీలం సుదర్శనం, మేకల మాల్యాద్రి, పరుచూరి రమేష్ ఉన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజశేఖర్

భోగభాగ్యాల భోగి



కందుకూరు: భోగి మంటలు వేస్తున్న మహిళలు



గుడ్లూరులో భోగి మంటలు వేస్తున్న యువకులు



కందుకూరు: ముత్తరాశిపాలెం రామాలయం వద్ద వేసిన భోగిమంట

కందుకూరు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున జరుపుకునే భోగి పండగను చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బంధుమిత్రులతో కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం వేకువజాము నుంచే ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేసి ఆనందించారు. యువకులు, పిల్లలు వీధుల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు పెద్ద ఎత్తున ఇంటి ముంగిట పోటీలు పడి ముగ్గు వేసి అలంకరించారు. దీంతో పట్టణంలో ప్రతి వీధిలో పండుగ శోభ కనిపించింది. ఉపాధి కోసం, ఉద్యోగాల నిమిత్తం నగరాలకు వలస వెళ్లిన వారంతా సంక్రాంతి పండగ పురస్కరించుకుని తిరిగి సొంత గ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. కందుకూరు పట్టణంలో గత రెండు రోజుల నుంచి బజార్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా బట్టల దుకాణాలు, చిల్లర దుకాణాలు వంటి వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పెద్ద ఎత్తున ప్రజలు సొంత గ్రామాలకు వచ్చారని, అదే స్థాయిలో పట్టణంలో కూడా రద్దీ వాతావరణం నెలకొందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. బంధుమిత్రులతో కలిసి పిండి వంటలు చేసుకునే వారు, కోడి పందేలు, ఎడ్ల పోటీలు, క్రికెట్ పోటీలు, ముగ్గుల పోటీలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతి రోజు సందడి వాతావరణం నెలకొంది.



మహిళా సంఘం ఆధ్వర్యంలో భోగి వేడుకలు జరుపుకుంటున్న మహిళలు

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

పట్టణంలోని ప్రముఖ ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. జనార్దన స్వామి దేవస్థానంలో గోదావేది కల్యాణం నిర్వహించగా, రెవెన్యూ కాలనీలోని కోదండ రామాలయంలో ధనుర్మాస పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను, భవ్య రామమందిర చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, జమ్మలమడక సుబ్రహ్మణ్యం, దత్తు జోగేంద్ర పాల్గొన్నారు.



రెవెన్యూ కాలనీలో ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

కందుకూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో భోగి పండుగ ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామునే లేచి ఇళ్ల ముందు భోగి మంటలు వేసుకున్నారు. యువకులు ఆనందోత్సాహాలతో భోగి మంటలు వేశారు. మహిళలు తెల్లవారు జామునే లేచి ఇళ్ల ముందు కళ్లాపు చల్లి ముగ్గులు వేశారు. తల్లంటి స్నానాలు చేసి దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

గుడ్లూరు: భోగి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో తెల్లవారుజామున 4 గంటల నుంచే యువత, మహిళలు, చిన్నారులు, వృద్ధులు అందరూ భోగి పండగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. తెల్లవారు జామున తల్లంటి స్నానాలు చేసి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు వితరణ



పాఠశాలకు అందిస్తున్న కుర్చీ, నిత్యావసరాలు



ఉలవపాడులో ట్రాఫిక్ నియంత్రణ

కందుకూరు రూరల్: కోవూరు రోడ్డులోని మానసిక దివ్యాంగుల పాఠశాలకు భారతదేశ యువ సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా విరాళం అందజేశారు. రూ.54,700 విలువైన 50 కుర్చీలు, బూస్టార్ వాటర్ డిస్పెన్సర్, నిత్యావసర సరుకులు అందించారు. యువ సేవా సమితి యువకులు విరాళాలు సేకరించారు. దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్గనైజర్ బెల్లం మనోజ్, శివకుమార్, టి.పృథ్వీరాజ్, డి.ప్రవీణ్, పరిటాల సాయి తరుణ్, సంగ గోవర్ధన్, దుంప విష్ణ, షేక్ ముజీబ్, నంబూరి రాము, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: రామాయపట్నంలో ట్రాఫిక్ నియంత్రణకు బోర్డులు, బీచ్ సందర్శకుల కోసం బల్లలను ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వారు అందించారు. ఆదివారం వైద్యశాల అధినేతలు చాపల వంశీ కృష్ణ, శాంతకుమారి వీటిని ఇచ్చారు. రామాయపట్నం మెరైన్ సీఐ కిశోర్ కుమార్ అభ్యర్థన మేరకు రెండు స్టాపర్ బోర్డులు, 8 సిమెంటు బల్లలను సమకూర్చారు. రామాయపట్నం గెస్ట్ హౌస్, పల్లెపాలెం బీచ్ వద్ద ఈ బల్లలను తీరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తీరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఈ స్టాపర్ బోర్డులను పెట్టినట్లు సీఐ కిశోర్‌కుమార్ తెలిపారు.

తెప్పోత్సవానికి ముస్తాబు



తెప్పోత్సవానికి ముస్తాబైన కోనేరు



ఉలవపాడులోని వేణుగోపాల స్వామి దేవస్థానం

- కనుమనాడు ఉలవపాడులో ఉత్సవం
- భారీగా హాజరుకానున్న భక్తులు

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో వెలసిన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి తెప్పోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది కనుమ పండగ నాడు గ్రామ నడిబొడ్డున ఉన్న కోనేరులో ఈ తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంక్రాంతి నాడు ఉదయం 7 గంటలకు స్వామి వారికి విశేష పూజ కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 16 న మంగళవారం కనుమ నాడు ఉదయం 7 గంటలకు ప్రత్యేక పూజలు అనంతరం సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం కార్యక్రమం జరుగుతుంది. దేవాదాయ శాఖ ఈఓ కేపీపీ ప్రసాద్ తెప్పోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కోనేరుకు రంగులు అద్ది విద్యుత్ అలంకరణ చేసినట్లు తెలిపారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు.

17న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): మండల సర్వసభ్య సమావేశం 17వతేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఫుడ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.50 కోట్లకు పైగా నష్టం



ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై

కురిచేడు: మండలంలోని ఆవులమంద గ్రామ పంచాయతీ పరిధిలోని ముష్టగంగవరం గ్రామ సమీపంలో గుండ్లకమ్మ వాగు పక్కన ఎస్‌హెచ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ శనివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైన విషయం విధితమే. యూనిట్ జనరల్ మేనేజర్ బీఎస్ఎల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 6 గంటలకు సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. సుమారు 7 గంటల సమయంలో యూనిట్‌లో నుంచి పొగలు వస్తున్నట్లు సమాచారం అందింది. సమీప గ్రామంలో ఉంటున్న సిబ్బంది నాగార్జున అనే సిబ్బందికి ఫోన్ చేసి ఫ్యాక్టరీ వద్దకు పంపారు. లోపల వ్యాక్యూం పైపులు పేలి మంటలు వస్తున్నాయని తెలిపాడు. యూనిట్‌లో ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లతో మంటలను 70 శాతం అదుపుచేశారు. ఆ తర్వాత 9 గంటల సమయంలో వినుకొండ, యర్రగొండపాలెం నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి రాత్రి 2 గంటల వరకు శ్రమించి మంటలను అదుపుచేశాయి. యూనిట్‌ను దర్శి డీఎస్పీ అశోకవర్ధన్, త్రిపురాంతకం సీఐ పాపారావు, కురిచేడు ఎస్సై దేవకుమార్ ఆదివారం ఉదయం సందర్శించారు.

ఆదివారం సాయంత్రం ఫిర్యాదు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అగ్నిప్రమాదానికి గురై నష్టం వాటిల్లిందని యూనిట్ జనరల్ మేనేజర్ ప్రసాద్ ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. రూ.150 కోట్లతో యూనిట్ నిర్మాణం చేశామని, అగ్నిప్రమాదం జరిగి ముఖ్యమైన మిషనరి కాలిపోవడం వల్ల సుమారు రూ.50 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై ఎం.దేవకుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

IV

సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం
15-1-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
847	247
72,568	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,973	▲	3
డోజోన్స్	37,593	▼	118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲	48
డాక్స్	16,705	▲	158
షాంఘై	2,882	▼	5
నికాయ్	35,557	▲	525

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	105.01	107.59
€	యూరో	ఎకటి	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	56.74	58.04
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	ఎకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	[illegible]	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.59	23.22
¥	చైనా యువాన్	[illegible]	10.41	23.36



రుణ పడొద్దు!

సొంత కారు, అందమైన భవంతి, ఇంట్లో అన్ని రకాల సాధనాలు (మెషీన్లు).. ఎందులోనూ రాజీపడేది లేదన్నట్టుగా ఉంది నేటి యువతరం ధోరణి. ముందు పొదుపు, తర్వాతే ఖర్చు.. గతంలో మన పెద్దలు అనుసరించిన ధోరణి. ముందు ఖర్చు.. మిగిలితేనే పొదుపు అన్నట్టుగా ఉంది నేటి తీరు. ఏ అవసరం వచ్చినా 'తగ్గేదే లే' అన్న ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్ల నుంచి వైద్య చికిత్సల వరకు అన్నింటికీ రుణబాట పడుతున్నారు. తీర్చే సామర్థ్యం ఉంటేనే రుణం తీసుకోవాలి. ప్రాధాన్యత లేని వాటికి సైతం రుణాలను ఆశ్రయిస్తే తీర్చే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కారణం ఏదైనా సకాలంలో రుణం వాయిదా చెల్లించలేకపోతే, ఎదుర్కోవాల్సిన పరిణామాలు చాలానే ఉంటాయి. చివరికి ఉద్యోగ అన్వేషణకు సైతం దూరం కావాల్సి రావచ్చు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి

- లేదంటే క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- క్రెడిట్ రిపోర్ట్‌లో మచ్చ
- చట్టపరమైన చర్యలను ఎదుర్కొనే పరిస్థితి
- అనవసర చార్జీల భారం
- బ్యాంకుతో సంప్రదింపుల ద్వారా పరిష్కారం
- రుణంపై స్వల్పకాలం పాటు మారటోరియం
- గడువు పెంపుతో తగ్గే ఈఎంఐ

గతంలో బ్యాంకుల రుణ వృద్ధిలో కార్పొరేట్ రుణాలదే పైచేయిగా ఉండేది. మొదటిసారి 2020 (కరోనా విపత్తు కాలంలో) నవంబర్‌లో బ్యాంకుల రుణాల్లో కార్పొరేట్‌లను కాదని రిటైల్ రుణాలు ముందుకు వచ్చేశాయి. అప్పటి నుంచి 2023 నవంబర్ 17 నాటికి చూస్తే రిటైల్ రుణాలు 79 శాతం పెరగ్గా.. కార్పొరేట్ రుణాల్లో వృద్ధి 28 శాతానికి పరిమితమైంది. 2023లో రెండో త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లోనూ రిటైల్ రుణాల్లో వృద్ధి 15 శాతంగా నమోదైంది. రిటైల్ రుణాల్లో కన్స్యూమర్ ఉత్పత్తుల కొనుగోళ్ల కోసం తీసుకునేవి (విలువ పరంగా) 20 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన రుణాలు 18 శాతం వృద్ధి చెందాయి. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకునే రుణాలు 12 శాతం పెరిగాయి. ఆటో రుణాలు 13 శాతం పెరిగితే, ఇంటి రుణాలు విలువ పరంగా మైనస్ 6 శాతంగా ఉన్నాయి. వినియోగ రుణాలు ఎక్కువగా ఉంటున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అదే సమయంలో రుణ ఎగవేతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రుణాల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది. 2023 జూలై నాటికి క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.2.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కంటే 31 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలన్నీ కూడా అన్‌సెక్యూర్డ్. రుణ గ్రహీత చేతులు ఎత్తేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థపై భారాన్ని మోపుతుంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ వ్యక్తిగత, అన్ సెక్యూర్డ్, క్రెడిట్ కార్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచుతూ, వీటికి బ్యాంకులు మరిన్ని నిధులను పక్కన పెట్టేలా గత నవంబర్‌లో ఆదేశాలు తీసుకొచ్చింది.

క్రెడిట్ స్కోర్‌కు విఘాతం

తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయినా, రుణాన్ని ఎగవేసినా అది క్రెడిట్ స్కోర్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. కరోనా అనంతరం రిటైల్ రుణాలు తీసుకోవడం గణనీయంగా పెరిగిపోగా, అదే సమయంలో అంతకుముందు తీసుకున్న రుణాలకు సంబంధించి ఎగవేతలు కూడా పెద్ద మొత్తంలోనే నమోదయ్యాయి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద మొత్తాల్లో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో చాలా మంది రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడింది.



నేడు ప్రతి రుణానికి సంబంధించి చెల్లింపుల చరిత్రతో క్రెడిట్ బ్యూరోలు రికార్డులను నిర్వహిస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించకపోయినా, ఎగ్గొట్టినా, సెటిల్‌మెంట్ చేసుకున్నా, రుణం కావాలంటూ విచారణలు చేసినా, అవన్నీ సంబంధిత వ్యక్తి పేరిట రికార్డుగా నమోదవుతాయి. వీటి ఆధారంగానే క్రెడిట్ బ్యూరోలు స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. 750, అంతకుమించి క్రెడిట్ స్కోర్ ఉంటే అది మెరుగైనది. రుణం సులభంగా వస్తుంది. మెరుగైన రేటుకు వస్తుంది. 750కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. ఒకవేళ రుణం లభించినా, అది అధిక వడ్డీ రేటుపై తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలి. నేడు దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ స్కోర్ ఆధారంగానే అన్‌సెక్యూర్డ్ రుణాలు మంజూరు చేస్తున్నాయి.

తదుపరి పరిణామాలు..

బకాయి చెల్లించాలంటూ రుణగ్రహీతను రుణం ఇచ్చిన సంస్థలు కోరతాయి. గడువు తీరిన 30 రోజులకూ చెల్లింపులు చేయకపోతే అప్పుడు ఆయా రుణగ్రహీతల సమాచారాన్ని క్రెడిట్ బ్యూరోలకు పంపిస్తుంటాయి. 30–60 రోజుల పాటు చెల్లింపులు చేయకపోతే అది క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. ఇక రుణ వాయిదా 60 రోజులు దాటినా చెల్లించలేని వారి క్రెడిట్ స్కోర్ మరింత తగ్గిపోతుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ వల్ల భవిష్యత్తులో రుణానికి ద్వారాలు మూసుకుపోతాయి. అత్యవసరంలో రుణం కావాల్సి వస్తే నిరాకరణ ఎదురుకావచ్చు. డిజిటల్‌గా రుణాలు ఇచ్చే సంస్థలు కనీసం ఒక్క రోజు ఆలస్యం చేసినా,ఎగవేతదారుల జాబితాలో చేరాల్సి వస్తోంది. 650–750 మధ్య స్కోర్ ఉన్న వారికి గృహ రుణం కావాలంటే, మెరుగైన స్కోర్ ఉన్న వారితో పోలిస్తే 2 శాతం అధిక రేటు చెల్లించాల్సి వస్తుంది. రూ.50 లక్షల రుణం 20 ఏళ్ల కాలవ్యవధికి కావాలంటే, తక్కువ స్కోర్ కారణంగా వడ్డీ రూపంలో అదనంగా రూ.12 లక్షల వరకు భారాన్ని మోయాల్సి రావచ్చు. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య ఈ రేటు వ్యత్యాసం మారుతుంది.

రుణం ఎగ్గొట్టడం సివిల్ నేరం కిందకు వస్తుంది. రుణ గ్రహీత ఇచ్చిన చెక్కుల ద్వారా వసూలు చేసుకునే చర్యలను ఆర్థిక సంస్థలు ప్రారంభిస్తాయి. గడువు ముగిసిన 90 రోజుల్లోపు కూడా రుణ గ్రహీత చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నోటీసు వస్తుంది. 180 రోజులు (ఆరు నెలలు) ముగిసినా ఎలాంటి ఫలితం లేకపోతే అప్పుడు నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద రుణం ఇచ్చిన సంస్థ కేసు దాఖలు చేస్తుంది. చెల్లించే సామర్థ్యం ఉన్నా, చెల్లించకపోతే ఉద్దేశపూర్వక ఎగవేతదారు అనే ముద్ర పడుతుంది. సరైన కారణంతో రుణం చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటే అప్పుడు రుణం ఇచ్చిన సంస్థతో చర్చలు నిర్వహించి పరిష్కారానికి, పరస్పర అంగీకారానికి రావచ్చు.

హోమ్‌లోన్ లేదా ప్రాపర్టీ లోన్ లేదా బంగారంపై రుణం వంటి సెక్యూర్డ్ రుణాల్లో రుణ గ్రహీత చెల్లింపుల్లో చేతులు ఎత్తేస్తే.. తనఖాగా ఉంచిన ఆస్తులను బ్యాంకులు వేలం వేస్తుంటాయి. అలాగే, ఆటోమొబైల్ రుణాల్లోనూ వాహనాన్ని జప్తు చేసి, చెల్లింపులకు తగినంత వ్యవధి ఇస్తాయి. అప్పటికీ చెల్లించకపోతే వాహనాన్ని వేలం వేసి రుణంలో సర్దుబాటు చేసుకుంటాయి.

బ్యాంక్ జాబ్ కష్టమే!

బలహీన క్రెడిట్ స్కోర్ ఉందంటూ ఉద్యోగ దరఖాస్తు తిరస్కరించే అధికారం బ్యాంకుల బోర్డులకు ఉంటుంది. బ్యాంక్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 650 క్రెడిట్ స్కోర్ ఉండాలన్న నిబంధనను ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) విధించింది. బాధ్యతాయుత ఆర్థిక నడవడిక ఉండాలన్నది దీని వెనుక ఉద్దేశం. ఎంతో విలువైన లావాదేవీల వ్యవహారాల బాధ్యతలను బ్యాంకుల ఉద్యోగులు చూస్తుంటారు. అందుకే ఈ నిబంధన ప్రవేశపెట్టారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలకు ప్రయత్నించే వారు మెరుగైన స్కోర్ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్త చర్యలను పాటించడం మంచిది. కొన్ని బహుళజాతి సంస్థలు కూడా ఉద్యోగం కోరుతున్న వారి క్రెడిట్ స్కోర్‌ను పరిశీలిస్తుంటాయి. 2022 మార్చిలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన



ప్రకటనలో.. బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకున్న ఏ రుణం చెల్లింపుల్లో అయినా విఫలం అయినట్టయితే, క్రెడిట్ కార్డ్ బకాయిలు సకాలంలో చెల్లింపులు చేయకపోతే అటువంటి వారు నియామకానికి అర్హులు కాదని స్పష్టంగా పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగంలో ఉద్యోగార్థుల క్రెడిట్ రిపోర్ట్‌లను పరిశీలించడం సర్వసాధారణమని.. దీనివల్ల ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉంటారనేది తెలుస్తుందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ఫైబ్ హెచ్‌ఆర్ హెడ్ మోనికా మిశ్రా తెలిపారు. ఇది సంస్థలో మోసాలు, చోరీల అవకాశాలను తెలియజేస్తుందన్నారు. ఆర్థిక అంశాల నిర్వహణలో బాధ్యతారహితంగా ఉండే వ్యక్తి, కంపెనీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సరైన వ్యక్తి కాదని మిశ్రా వివరించారు.

రుణం కోసం రుణం...



తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితుల్లో మరో రుణం తీసుకుని చెల్లించే ఆలోచనలు సరికాదు. ముందు తీసుకున్న రుణంపై అధిక వడ్డీ రేటు ఉండి, చాలా తక్కువ రేటుకే మరో సంస్థ రుణం ఇవ్వడానికి ముందుకు వస్తే అప్పుడు ఆలోచించొచ్చు. తక్కువ రేటుపై రుణం తీసుకుని అధిక రేటుతో కూడిన రుణాన్ని తీర్చివేయవచ్చు. వ్యక్తిగత రుణాలపై 14–15 శాతం మేర వడ్డీ రేటు ఉంటే, మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 12 శాతానికే లభిస్తుంది. అలాంటప్పుడు పరిశీలించొచ్చు. అంతేకానీ, చెల్లింపుల సమస్య నుంచి బయటపడేందుకు మరో రుణాన్ని ఆశ్రయిస్తే సమస్యను పెంచుకున్నట్టు అవుతుంది. అలాగే, క్రెడిట్ కార్డ్‌పై 3–4 రూపాయల వడ్డీ పడుతుంది. వ్యక్తిగత రుణాన్ని తీసుకుని క్రెడిట్ కార్డ్ రుణాన్ని తీర్చివేయవచ్చు.

రుణ గ్రహీత ముందున్న మార్గం



రుణం తీసుకుని, చెల్లింపులు సకాలంలో చేయకపోయినా.. రుణం ఇచ్చిన సంస్థలు గౌరవప్రదంగా, పారదర్శకంగానే వ్యవహరించాలి కానీ, వేధించడం, బెదిరించడం చేయకూడదని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు. రుణం 90 రోజులకు మించి చెల్లింపులు లేకపోతే, అప్పటికీ చెల్లించేందుకు 60 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సెక్యూర్డ్ రుణం చెల్లించనప్పుడు, తనఖాలో ఉంచిన ఆస్తులు లేదా వాహనాలను విక్రయించగా, వచ్చే మొత్తం నుంచి రుణం మినహాయించుకుని మిగిలినది తిరిగి రుణ గ్రహీతకు ఇచ్చేయాల్సి ఉంటుంది. రుణం చెల్లించలేనప్పుడు మారటోరియం లేదా వన్‌టైమ్ పరిష్కారం కోసం డిమాండ్ చేయవచ్చు. రుణం చెల్లించలేకపోవడం వెనుక సహేతుక కారణాలు ఉంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థను సంప్రదించాలి. చెల్లించడానికి మరింత సమయం ఇవ్వాలని కోరొచ్చు. మీరు చెప్పిన కారణాల్లో వాస్తవికత ఉందని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ భావిస్తే రుణ చెల్లింపులపై స్వల్పకాలం పాటు మారటోరియం (విరామం) కల్పిస్తాయి. లేదంటే రుణ కాల వ్యవధిని పెంచి, ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తాయి.


ఏ రుణంలో ప్రతికూలతలు ఎలా..?

క్రెడిట్ కార్డు రుణం



క్రెడిట్ కార్డ్ బిల్లు మొత్తం చెల్లించలేని సందర్భాల్లో, మినిమం డ్యూ (బిల్లులో నిర్ణీత శాతం) చెల్లించినా సరిపోతుంది. ఈ మినిమం డ్యూని కూడా చెల్లించనట్టయితే ఆరు నెలలు వేచి చూసిన తర్వాత డిఫాల్ట్‌గా ఖరారు చేస్తారు. డిపాజిట్‌ను సెక్యూరిటీగా ఉంచి క్రెడిట్ కార్డు తీసుకుంటే, బకాయి పడిన సందర్భంలో డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద సర్దుబాటు చేసుకుంటారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పొందిన క్రెడిట్‌కార్డు అయితే, బకాయి వసూలు బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగిస్తాయి క్రెడిట్ కార్డు కంపెనీలు. రుణ గ్రహీత నుంచి రుణాన్ని రప్పించే ప్రయత్నాలను ఏజెన్సీలు చేస్తాయి. అప్పటికీ ఫలితం లేకపోతే కోర్టులో కేసు దాఖలవుతుంది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు బ్లాక్ లిస్ట్‌ను నిర్వహిస్తుంటాయి. చెల్లింపులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తాయి.

విద్యా రుణం



విద్యా రుణం ఈఎంఐ చెల్లింపులు సాధారణంగా కోర్సు ముగిసి, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి మొదలవుతాయి. కానీ, కొన్ని కారణాల వల్ల కోర్స్‌లో సకాలంలో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం రాదు. కోర్సు పూర్తి చేసినా కానీ వెంటనే అందరికీ ఉపాధి లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. లేదంటే ఉద్యోగం వచ్చినప్పటికీ, అది కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వచ్చిన సందర్భాల్లో రుణ ఈఎంఐ చెల్లించలేకపోతే, తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే ఉద్యోగం లభించకపోయినా, వచ్చిన ఉద్యోగం కోల్పోయినా బ్యాంకులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలియజేయాలి. మరింత గడువు కోరాలి. లేదంటే బ్యాంక్‌లు నిర్ణీత కాలం పాటు వేచి చూసి మిగిలిన రుణాల మాదిరే నోటీసు జారీ ద్వారా తదుపరి చర్యలు ప్రారంభిస్తాయి. విద్యా రుణానికి సంబంధించి డిఫాల్టర్‌గా మారితే భవిష్యత్‌లో ఎన్నో రుణాలకు అవరోధంగా మారొచ్చు. రూ.4–10 లక్షల వరకు విద్యా రుణాలకు బ్యాంక్‌లు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. అంతకుమించితే మరో వ్యక్తిని గ్యారంటర్‌గా, లేదా ప్రాపర్టీని తనఖాగా ఉంచాలని కోరతాయి. సకాలంలో చెల్లించలేకపోతే గ్యారంటర్ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

వినియోగ రుణం



కన్స్యూమర్ ఉత్పత్తుల కోసం తీసుకునే రుణాలు, వాహన రుణాలు అయినా గడువులోపు చెల్లించకపోతే ఒకటి రెండుసార్లు నోటీసును జారీ చేస్తాయి. 30 రోజుల్లోగా చెల్లించకపోతే అప్పుడు ముందుగా సమర్పించిన చెక్కులను నగదుగా మార్చుకునే చర్యలు మొదలు పెడతాయి. చెక్కులు బౌన్స్ అయితే కోర్టులో కేసు దాఖలు చేస్తాయి. వాహనం లేదా ఉత్పత్తిని స్వాధీనం చేసుకుంటాయి. వడ్డీసహా రుణ మొత్తాన్ని చెల్లించి సమస్య నుంచి బయటపడవచ్చు.

వ్యక్తిగత రుణం



వ్యక్తిగత రుణం వాయిదా గడువు ముగిసిన 30 రోజుల వరకు చెల్లించకపోతే డిఫాల్ట్‌గా పరిణిస్తాయి. ఇదే విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తాయి. ఇలా వరుసగా మూడు వాయిదాల్లో విఫలమైతే అప్పుడు రుణంపై అదనపు వడ్డీ రేటును (పీనల్ ఇంటరెస్ట్) వడ్డిస్తాయి. 30 నుంచి 60 రోజుల్లోపు రుణ వాయిదాను వడ్డీ, అన్ని చార్జీలతో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్‌పై స్వల్ప ప్రభావమే పడుతుంది. 90 రోజులకు కూడా చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. 180 రోజుల తర్వాత కూడా చెల్లింపులు రాకపోతే అప్పుడు రుణ గ్రహీతపై కేసులు దాఖలవుతాయి.

గృహ రుణం



ఇంటిపై పొందే మార్ట్‌గేజ్ రుణం చెల్లించకపోతే ఇంటిని కోల్పోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు చెల్లింపులు లేకపోతే దాన్ని డిఫాల్ట్ (బకాయిపడినట్టు)గా పరిగణిస్తారు. వరుసగా మూడు ఈఎంఐలు కూడా చెల్లించకపోతే, అప్పుడు బకాయిలను 60 రోజుల్లోగా సెటిల్ చేసుకోవాలంటే లీగల్ నోటీసు పంపిస్తాయి. ఆ గడువులోపు స్పందించకపోతే, సర్ఫేసీ చట్టం కింద ఇంటి జప్తు ప్రక్రియను మొదలు పెడతాయి. ఆ తర్వాత కూడా కొల్లేటరల్ (తాకట్టు) విలువ, వేలం తేదీ తదితర వివరాలతో ఒక నోటీసు పంపిస్తాయి. అప్పుడు స్పందించినా, బ్యాంక్‌లు పరిష్కారానికి అవకాశం ఇస్తాయి. చివరి ఆప్షన్‌గా ఇంటిని వేలం నిర్వహిస్తాయి. దీనివల్ల ఇంటిని కోల్పోవడంతోపాటు, క్రెడిట్ రిపోర్ట్‌లో కొన్నేళ్లపాటు దీని ప్రభావం కనిపిస్తుంది.

మిరే నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 24న ముగుస్తుంది. కనీసంగా రూ. 5,000, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించిన నిధులను ఈక్విటీ, డెట్.. మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఎక్స్చేంజ్ ట్రేడెడ్ కమోడిటి డెరివేటివ్స్ మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)


15-1-2024	
విశాఖ	599–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
14-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

అదనపు పన్ను ఆదాకు మార్గం..?

పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద ఇప్పటికే రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. దీనికి అదనంగా పన్ను ఆదా కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– రాకేశ్ వర్మ

ఐటీ చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్ఠ పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఇప్పటికే మీరు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అప్పుడు అదనపు పన్ను ఆదా కోసం మీ ముందున్న మార్గం నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్-1. రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో గరిష్ఠంగా రూ.50,000 పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. సెక్షన్ 80సీకి అదనంగా కల్పించిన ప్రయోజనం ఇది. విశ్రాంత జీవనం కోసం నిధి ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వీలుగా 2004లో కేంద్ర సర్కారు ఎన్‌పీఎస్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 18–70 ఏళ్ల వయసు పరిధిలోని ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులే. ఒక ఏడాదిలో ఇందులో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేసినా సరిపోతుంది. ఇందులో చేసిన పెట్టుబడి ఏదైనా కానీ 60 ఏళ్ల వరకు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. అంటే అప్పటి వరకు లాకిన్ అయి ఉంటుంది. కొన్ని అసాధారణ పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనే దీన్నుంచి ఉపసంహరణలకు అనుమతి ఉంటుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తారు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇటీవలి తీసుకొచ్చిన సవరణ నేపథ్యంలో 60 ఏళ్లు నిండిన తర్వాత.. నెల లేదా త్రైమాసికం లేదా ఏడాదికోసారి క్రమంగా కావాల్సినంత ఉపసంహరించుకోవడానికి వీలు ఏర్పడింది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు 2 రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లలో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఆటో లేదా యాక్టివ్. ఆటో ఆప్షన్ ఎంపిక చేసుకోవడం కొంత బెటర్. ఈ ఆప్షన్‌లో ఈక్విటీలకు కేటాయింపులు ఇన్వెస్టర్ వయసు ఆధారంగా మారుతుంటాయి. ఉదాహరణకు ఇన్వెస్టర్ వయసు 35 ఏళ్లు అనుకుందాం. 100 నుంచి 35 ఏళ్లు తీసివేయగా, మిగిలిన మేర (65%) ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఇన్వెస్టర్ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. యాక్టివ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు గరిష్ఠంగా 75% వరకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఈక్విటీ కేటాయింపులు పోను, మిగిలినదాన్ని డెట్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలకు కేటాయించొచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

జేకే లక్ష్మీ సిమెంట్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 869 **టార్గెట్:** రూ. 1,000

ఎందుకంటే: అనుబంధ సంస్థ ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ లిమిటెడ్ ద్వారా జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుతం చేపట్టిన సామర్థ్య విస్తరణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. వార్షికంగా 2.5 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) గ్రైండింగ్ యూనిట్ పనులు పటిష్ట రీతిలో కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికానికల్లా(ఏప్రిల్–జూన్) వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభంకావచ్చని అంచనా. ఇప్పటికే 1.5 ఎంటీపీఏ సామర్థ్యంగల క్లింకర్ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకావడంతోపాటు నిలకడను సైతం సాధించింది. ఉదయ్‌పూర్ సిమెంట్ ప్లాంటులో తయారయ్యే క్లింకర్‌ను గ్రైండింగ్ కోసం జేకే లక్ష్మీ సిమెంట్ వినియోగించుకుంటుంది. మరోపక్క సూరత్‌లోనూ 1.35 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు రూ. 220 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. 1.35 ఎంటీపీఏలో 0.7 మిలియన్ టన్నుల సామర్థ్యం వచ్చే ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)కల్లా అందుబాటులోకి రానుంది. మిగిలిన 0.65 ఎంటీపీఏ సామర్థ్యం రెండేళ్ల తదుపరి(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రారంభంకావచ్చని అంచనా. ప్రణాళికల ప్రకారమే దుర్గ్ ప్లాంటులో రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణ లాభాలను పెంచుకునే బాటలో కంపెనీ విభిన్న చర్యలు తీసుకుంటోంది.



తేజాస్ నెట్‌వర్క్స్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 860 **టార్గెట్:** రూ. 1,050

ఎందుకంటే: పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) ఆధారిత టెలికం పరికరాల తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా తేజాస్ నెట్‌వర్క్స్ నిలుస్తోంది. వైర్‌లైన్, వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ ప్రొడక్టుల తయారీ, డిజైనింగ్‌లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదలు 2027–28 వరకూ కంపెనీ రూ. 29,200 కోట్ల విలువైన ఆర్డర్లను పూర్తి చేయనుంది. వెరసి రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 6,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించే అవకాశముంది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్, భారత్ నెట్ ప్రాజెక్టులు తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం గరిష్టస్థాయికి చేరే వీలుంది. ఈ ఏడాదితో పోలిస్తే 5 రెట్లు పుంజుకోవచ్చు. దేశీయంగా తయారీ రంగంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్‌ఐ) ద్వారా కంపెనీ ప్రధానంగా లబ్ధిని పొందే అవకాశముంది. బీఎస్‌ఎన్‌ఎల్, భారత్‌నెట్, రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వ భారీ పెట్టుబడి వ్యయాలు ఇందుకు సహకరించనున్నాయి. అంతేకాకుండా కీలక మౌలిక సదుపాయాలు, ప్రయివేట్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్, ప్రపంచస్థాయిలో చైనాకు ప్రత్యామ్నాయ టెలికం పరికరాల కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యత సైతం తేజాస్ నెట్‌వర్క్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. టాటా గ్రూప్ సెమీకండక్టర్ కార్యకలాపాలు కంపెనీకి ప్రయోజనం చేకూర్చే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే